www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

గురువారం, 11-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :42 Issue : 42 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## స్థిరాస్తి వ్యాపారి అరుణ్ కుమార్ దురాగతం

- భార్యపై అనుమానంతో కాల్పులు
- అక్కడికక్కడే మృతి చెందిన ఇల్లాలు

3



## ఆల్ఫా టీజర్ పై షారుఖ్ ప్రశంసలు





8

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే
# బండకేసి కొడతారు

- టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ
- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్ పని
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగి పోతోంది
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కెసిఆర్
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్టేట్స్:** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా

మిగతా 2వ పేజీలో..



## ఘనా పారిశ్రామికాభివృద్ధికి సహకారం

- రిపబ్లిక్ ఆఫ్ ఘనా ఉన్నతస్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్టేట్స్ :** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గ నిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా

మిగతా 2వ పేజీలో..





## తెలంగాణ, కర్ణాటక ఫలితాలపైనే హస్తం పార్టీ ఆశలు

## కాంగ్రెస్ భవితవ్యం
# దక్షిణాదిపైనే..!

- రేవంత్, డీకే, సునీల్ కనుగోలు వ్యూహాలపై దృష్టి
- ప్రజా వ్యతిరేకతను అధిగమించడమే ప్రధాన సవాల్ అధికారాన్ని నిలబెట్టుకోవడంపై కాంగ్రెస్ ఫోకస్
- జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాలే కీలకం

**తెలంగాణ బ్యూరో, అశ్వి అప్టేట్స్:** జాతీయ రాజకీయాల్లో తిరిగి అధికార పీఠాన్ని అధిరోహించాలన్న కాంగ్రెస్ ఆశలు ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలపైనే ఆధారపడి ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటకలో అధికారాన్ని నిలబెట్టుకోవడం ఆ పార్టీకి అత్యంత కీలకంగా మారింది. ఈ రెండు రాష్ట్రాల్లో విజయవంతమైన పాలన అందించగలిగితేనే జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు బలం చేకూరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటకలో డీకే శివకుమార్, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయ వ్యూహాల్లో ప్రధాన పాత్రధారులుగా నిలిచారు. ఈ ముగ్గురి సమన్వయంతోనే రాబోయే ఎన్నికలకు పార్టీ కార్యాచరణ రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో అధికార


మిగతా 2వ పేజీలో..



7

## అత్యధిక కాలం ప్రధానిగా
# మోదీ రికార్డు

నెహ్రూ రికార్డును తిరగరాసిన మోదీ



7

## గ్రానేడ్ పేలుడు విషాదం

- ఉరిలో దుర్ఘటన ఘటన
- ఇద్దరి జవాన్ల మఅతి.. విచారణకు ఆదేశాలు జారీ



7

## ఎన్డీఏ భేటీలో ప్రధాని మోడీకి అభినందనలు

## బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం: కవిత

- బీసీ హక్కుల సాధనకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం
- కేంద్రంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- దేశవ్యాప్తంగా 50 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు ఇస్తామని హామీ
- బీసీ నాయకులతో సమావేశమైన తెలంగాణ రక్షణ సేన చీఫ్

**హైదరాబాద్, జూన్ 10:** చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, శ్రీకాంతాచారి వంటి ఉద్యమ వీరుల ఆశయాల సాధన కోసమే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ప్రారంభించానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల

మిగతా 2వ పేజీలో..



## రోడ్డు భద్రత
# ప్రతి ఒక్కరి బాధ్యత



- హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణ
- అంతా అప్రమత్తంగా వుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి
- డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం భగవత్

2

## వచ్చే వేసవి నాటికి 'మేడిగడ్డ'
# పునరుద్ధరణ పూర్తి

- జూలై నాటికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి
- సెప్టెంబర్ 2026 నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనులు ప్రారంభం
- రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మేడిగడ్డ, జూన్ 10, అశ్వి అప్టేట్స్ :** మేడిగడ్డ బ్యారేజీతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్

మిగతా 2వ పేజీలో..





## ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

- రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం
- గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల
- సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం
- రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ

2

## సుస్థిర మైనింగ్‌లో
# సింగరేణి మరో మైలురాయి

- వడ్డీతో రూ.40 కోట్ల డిపాజిట్ తిరిగి చెల్లించిన కేంద్ర సంస్థ
- డోర్లీ-2 గని మూసివేతలో ఆదర్శంగా నిలిచిన సింగరేణి

**సింగరేణి భవన్, జూన్ 10, అశ్వి అప్టేట్స్:** బొగ్గు గనుల నిర్వహణలో మాత్రమే కాకుండా, గనుల మూసివేత అనంతరం పర్యావరణ పరిరక్షణలోనూ అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్న సంస్థగా సింగరేణి మరోసారి

మిగతా 3వ పేజీలో..





## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

- పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్టేట్స్:** మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను

మిగతా 2వ పేజీలో..

## పీసా చట్టం ఆదివాసీల
# స్వాభిమానానికి ప్రతీక



- గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం
- పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, అశ్వి అప్టేట్స్:** పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి

మిగతా 2వ పేజీలో..

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి సహకారం

**మొదటిపేజీ తరువాయి**

ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న ఫార్మా హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ - ఘనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలెప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మాన్యుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సిన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకమైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

## కాంగ్రెస్ భవితవ్యం దక్షిణాదిపైనే..!

**మొదటిపేజీ తరువాయి**

వ్యతిరేకత ప్రతి ప్రభుత్వానికీ సవాల్‌గా మారుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండోసారి ప్రజల మద్దతు పొందడం కష్టంగా మారిన పరిస్థితుల్లో తెలంగాణ, కర్ణాటకల్లో ఆ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత పార్టీ నాయకత్వంపై పడింది. గత ఎన్నికల్లో సంక్షేమ హామీలు, ఎన్నికల వ్యూహాలతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో సునీల్ కనుగోలు కీలక పాత్ర పోషించారు. అయితే అధికారాన్ని సాధించడం కంటే దానిని నిలబెట్టుకోవడం మరింత క్లిష్టమైన పని. సంక్షేమ కార్యక్రమాలతో పాటు సమర్థవంతమైన పాలన, ప్రజలతో నిరంతర అనుసంధానం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రజల్లో నెలకొంటున్న అసంతృప్తిని ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం, అవసరమైతే సంస్థాగత మార్పులు చేపట్టడం ద్వారా అధికార వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత కీలకంగా మారనున్నాయి. తెలంగాణ, కర్ణాటకల్లో విజయాలు సాధిస్తే జాతీయ స్థాయిలో పార్టీకి కొత్త ఉత్సాహం లభించే అవకాశం ఉంది. అదే సమయంలో ఈ రాష్ట్రాల్లో ఎదురుదెబ్బ తగిలితే కాంగ్రెస్ జాతీయ రాజకీయ వ్యూహాలపై ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదు. దక్షిణాదిలో తమ బలాన్ని కాపాడుకుంటూ దేశవ్యాప్తంగా విస్తరించాలన్న కాంగ్రెస్ లక్ష్యం ఎంతవరకు ఫలిస్తుందో రాబోయే ఎన్నికలే తేల్చనున్నాయి. తెలంగాణ, కర్ణాటక రాజకీయ పరిణామాలు భవిష్యత్ జాతీయ రాజకీయాలకు కీలక సూచికలుగా మారనున్నాయి.

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు


**మొదటిపేజీ తరువాయి**

లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచఎంసీ, హెచఆరఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**పటాన్ చెరు జూన్ 10, అశ్వ అప్డేట్స్:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ సభా వేదికగా ఈ రోజు నుంచి హెల్మెట్, సీటు బెల్ట్ ధరించనిదే గ్రామంలోకి ఎవరికీ అనుమతి లేదని తీర్మానం చేస్తున్నామన్నారు. దేశంలో తెలంగాణ పోలీసు శాఖ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందని, ట్రాఫిక్ నిబంధనలపై తమ గ్రామంలో అవగాహన కల్పించేందుకు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ జిల్లా ప్రజలను రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తం చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు డీజీపీ భగవత్ ఫసల్వాడి గ్రామానికి రావడం అరైవ్ అలైవ్ కార్యక్రమ ప్రాధాన్యతను తెలియజేస్తున్నదన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అంటే మన ప్రయాణం సురక్షితంగా సాగి గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవడం అని తెలిపారు. డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిన్న మొబైల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే స్క్రీన్ గార్డ్ వేయిస్తామని, దానికంటే మన ప్రాణాలు, మన ప్రయాణం ఎంతో విలువైనవని గుర్తించాలని అన్నారు. ప్రాణ రక్షణలో భాగమైన హెల్మెట్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేటప్పుడు డ్రైవర్ మాత్రమే కాక ప్రయాణికులందరూ సీటు బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. యువత ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని ఇతరులకు కూడా చైతన్యం కల్పించాలని కోరారు. అనంతరం గ్రామ ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎంహెచ్‌వో లలిత, ఆర్డీవో రాజేందర్, రవాణా శాఖ జాయింట్ కమిషనర్ వెంకటరమణ, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఎమ్మార్వో దశరథ్, జిల్లా పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వచ్చే వేసవి నాటికి 'మేడిగడ్డ' పునరుద్ధరణ పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేలు, పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎసఏ)లకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామనిరు. వర్షాకాలం ముగిసిన వెంటనే 2026 నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతోపాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో జీపీఆర్ పరీక్షలు 90 శాతం పూర్తయ్యాయని, బోర్‌హోల్, జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు

**గత పాలకుల నిర్ణయాలే ముంచాయి**

బీఆర్‌ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మేడిగడ్డతోపాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్‌లు పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయి' అని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38వేల కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 201617 నాటికే పూర్తై సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38వేల కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.లక్ష కోట్లు దాటిందని, 'కాగ్' అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందంటూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించిందని పేర్కొన్నారు. పునరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్సల్టెంట్ సంస్థ ఏఎఫఆర్‌వైను ఐఐటీ ముంబయితో కలిసి నియమించామని తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నమూనా అధ్యయనాలు, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఎన్‌డీఎస్‌ఏ గుర్తించిన స్కార్ డెప్త్, కట్ఆఫ్ డెప్త్, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, ఎనర్జీ డిసిపేషన్, గేట్ల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అధ్యయనాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

**మొదటిపేజీ తరువాయి**

భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆరఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా వి□ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానవి□ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానవి□కి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆరఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆరఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆరఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.






## బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం: కవిత

**మొదటిపేజీ తరువాయి**

కవిత అన్నారు.

బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, శాసన మండలిలో తీర్మానాలు ఆమోదించి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు.

అయితే బిల్లును కేంద్రానికి పంపిన తర్వాత దాని ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఒత్తిడి తీసుకురావడం లేదని విమర్శించారు. బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించేందుకు మరింత బలమైన ఉద్యమం అవసరమని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా పోరాటం చేపడతామని కవిత ప్రకటించారు. ఈ అంశంపై వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలను విస్తరించనున్నట్లు తెలిపారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరపున పోటీ చేసే అభ్యర్థుల్లో 50 శాతం టికెట్లను బీసీ నాయకులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయంగా, సామాజికంగా బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

సమావేశంలో పలువురు బీసీ నాయకులు పాల్గొని రిజర్వేషన్ల అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

**మొదటిపేజీ తరువాయి**

సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మ□లస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రావి□ణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

**ఆదిలాబాద్, జూన్ 10, అశ్వ అప్డేట్స్:**

తెలంగాణలో పోలీసింగ్ విధానంలో కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పని చేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు.

# సుస్థిర మైనింగ్‌లో సింగరేణి మరో మైలురాయి

**మొదటిపేజీ తరువాయి**

తన ప్రత్యేకతను చాటుకుంది. బెల్లంపల్లి ఏరియాలోని డోర్లీ2 ఓపెన్ కాస్ట్ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా విజయవంతంగా మూసివేసినందుకు గుర్తింపుగా, గని ప్రారంభ సమయంలో డిపాజిట్ చేసిన సుమారు రూ.40 కోట్ల సొమ్మును వడ్డీతో సహా కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ సింగరేణికి తిరిగి చెల్లించింది. గనుల ప్రారంభం నుంచి మూసివేత వరకు అమలు చేయాల్సిన మైన్ క్లోజర్ ప్లాన్, పర్యావరణ పరిరక్షణ చర్యలు, భూ సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలు తదితర అంశాలను సింగరేణి సంస్థ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేసింది. డోర్లీ2 గని మూసివేత ప్రక్రియలో సింగరేణి చూపిన బాధ్యతాయుత వైఖరి, పర్యావరణ హిత చర్యలు, పారదర్శకత మరియు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసిన తీరుకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గనుల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సుస్థిర మైనింగ్ విధానాలను అమలు చేస్తున్న సింగరేణి సంస్థకు ఇది మరో విశిష్ట గుర్తింపుగా భావిస్తున్నారు.



**ఏమిటి ఈ ఎస్క్రో డిపాజిట్? ఎప్పుడు తిరిగి చెల్లిస్తారు ?**

కొత్తగా ఏదైనా గనిని ప్రారంభిస్తున్నప్పుడు ఆ గని జీవితకాలంలో అమలు జరపాల్సిన పర్యావరణహిత చర్యలు, గని మూసివేత నాటికి చేపట్టవలసిన ఇతర చర్యలపై కేంద్ర బొగ్గు మంత్రి శాఖ అనుబంధ సంస్థ అయిన కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారు కొన్ని నియమ నిబంధనలను సూచిస్తారు. ఈ నిబంధనలను సంబంధిత కంపెనీ ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది. ఇవి అమలు చేయటానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి అంత మొత్తాన్ని సదరు కంపెనీ నుండి ముందస్తు జాగ్రత్తగా ఒక డిపాజిట్ రూపంలో తీసుకుంటారు. కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ తో పాటు, బొగ్గు గని యాజమాన్యం, బ్యాంకర్లు కలిసి ఈ మేరకు ఒక ఒప్పందం కుదుర్చుకొని సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. గని జీవితకాలం పూర్తి అయిన తర్వాత నిబంధనల ప్రకారం గని యాజమాన్యం హామీ ఇచ్చిన ప్రకారం పర్యావరణహిత చర్యలు పూర్తి చేసినట్లయితే సదరు డిపాజిట్ ను వడ్డీతో సహా తిరిగి గని యాజమాన్యానికి చెల్లిస్తుంటారు.ఇదే విధంగా సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలో డోర్లీ ఓపెన్ కాస్ట్2 గనికి 2013 14 లో అనుమతులు పొందింది. నిబంధనల ప్రకారం గని ప్రారంభం నుంచి చివరి వరకు తాను చేపట్టనున్న పర్యావరణ హిత చర్యలకు సంబంధించి అంచనా వ్యయం సుమారు 26.79 కోట్ల రూపాయలను కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పేరుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద డిపాజిట్ చేసింది. కాగా ఈ గని ఏడు సంవత్సరాలు పాటు బొగ్గును ఉత్పత్తి చేసిన తర్వాత 202324 లో మూసివేశారు. అప్పటికే సింగరేణి సంస్థ దశలవారీగా ఒప్పందంలోని అంశాలను అమలు జరుపుతూ వచ్చింది. ఈ పనులు ఇచ్చిన హామీ ప్రకారం పూర్తి అయినాయా? లేదా? అనే అంశాన్ని ఒక థర్డ్ పార్టీ ఏజెన్సీ అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శిబ్‌పూర్ (పశ్చిమబెంగాల్) ద్వారా జులై, 2024లో నిర్వహించారు. ఆడిట్లో అన్ని సక్రమంగా జరిగాయని సింగరేణి సంస్థ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు జరిపిందని పేర్కొన్నారు. ఫలితంగా ఏడేళ్ల క్రితం డిపాజిట్ చేసిన సొమ్మును వడ్డీతో సహా కలిపి తిరిగి సింగరేణి సంస్థకు చెల్లిస్తున్నట్లు డిప్యూటీ అసిస్టెంట్ కోల్ కంట్రోలర్ ఆకాష్ శివ హరే తమ లేఖలో ఇటీవల పేర్కొన్నారు. మొత్తం రూ.40 కోట్లు చెల్లించాల్సి ఉండగా దీనిలో 90% డిపాజిట్ సొమ్ము 36.63 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నామని, మిగిలిన పది శాతం జస్ట్ ట్రాన్సిషన్ ప్రొవిజన్స్ అంశాలు పరిశీలించిన తర్వాత చెల్లిస్తామని పేర్కొన్నారు. అంటే దాదాపు రూ.40 కోట్లు తిరిగి సింగరేణి సంస్థ ఖాతాలో పడుతున్నాయి. దీనిపై సింగరేణి యాజమాన్యం తన సంతృప్తిని వ్యక్తం చేసింది.

**సంస్థ పాటించిన నిబంధనలు**

డోర్లీ ఓపెన్ కాస్ట్2 గని తవ్విన ప్రాంతంలో గతంలో ఉన్న దట్టమైన అడవికి సమంగా తిరిగి 162.517 హెక్టార్ల విస్తీర్ణంలో దట్టమైన అడవులను పెంచి అందజేసింది. గని తవ్వకానికి ముందు ఆ ప్రదేశంలో ఉన్న సారవంతమైన భూమి పైపొర మట్టి (టాప్ సాయిల్) సుమారు 19.76 లక్షల క్యూబిక్ మీటర్ల పరిమాణంను తొలగించి వేరేచోట భద్రపరిచి, దానిని ఓవర్ బర్డెన్ దంపులపై తిరిగి పరిచి, వాటిపై మొక్కలను పెంచింది. అందువల్లనే డోర్లీ ఓవర్ బర్డెన్ దంపుల మీద దట్టమైన అడవిగా ప్లాంటేషన్ పెరిగింది.3. ఓపెన్ కాస్ట్ నిర్వహించిన సమయంలో వాతావరణ కాలుష్యం జరగకుండా డ్రిల్ మిషన్ల వద్ద డస్ట్ కలెక్టర్లను ఏర్పాటు చేసింది. వెట్ డ్రిల్లింగ్ నిర్వహించింది. 28 కిలో లీటర్ల సామర్థ్యం గల వాటర్ స్ప్రింక్లర్ ఒకటి, పది కిలో లీటర్ల సామర్థ్యం గల వాటర్ స్ప్రింక్లర్ లు రెండు వినియోగించి నిరంతరాయంగా ధూళి లేవకుండా చర్యలు తీసుకుంది. కోల్ బంకర్లు సీ హెచ్ పీ ల వద్ద మిస్ట్ స్ప్రేయర్లను ఏర్పాటు చేసింది.

4. హాల్ రోడ్లకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటి గ్రీన్ బెల్టులు ఏర్పాటు చేసింది. ఇలా అనేక రకాల చర్యలు తీసుకోవడంతో పాటు వాతావరణ కాలుష్యం నియంత్రణలో ఉన్న విషయాన్ని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎన్విరాన్ మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ వారి ద్వారా ఆడిటింగ్ జరిపింది. 5. ఓపెన్ కాస్ట్ వల్ల జల కాలుష్యం జరగకుండా ఉండేందుకు ఓపెన్ కాస్ట్ చుట్టూతా పది కిలోమీటర్ల పొడవైన గార్ల్యాండ్ డ్రైనేజీ లు ఏర్పాటు చేసింది. రెండు చెక్ డ్యామ్ లను నిర్మించి బురద నీరు ప్రకృతిలో కలవకుండా చర్యలు తీసుకుంది. ఐదు సెటిలింగ్ ట్యాంకులను ఏర్పాటు చేసింది. గని నుంచి విడుదలయ్యే నీటిని శుభ్రపరిచి సమీపంలోని కాలువల్లోకి పంపించింది. ఈ విధంగా తీసుకున్న చర్యలను కూడా ప్రభుత్వ గుర్తింపు పొందిన పై సంస్థ ద్వారానే ఆడిటింగ్ జరిపించింది.

మూసివేసిన గని వద్ద రక్షణ ఏర్పాట్లను చేపట్టింది. సెక్యూరిటీ గార్డ్ లను నియమించడంతో పాటు సూపర్ వైజర్లను కూడా నియమించింది. గని చుట్టూ కంచెను ఏర్పాటు చేసింది. గతంలో గని నిర్వహణ సందర్భంగా నిర్మించిన భవనాలను, నిర్మాణాలను సురక్షితంగా తొలగించింది. ఈ చర్యలను, వీటికి అయిన ఖర్చులు పరిశీలన బృందం తనిఖీ చేసి సంతృప్తి చెందిన తర్వాత సింగరేణి సంస్థ డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి కంపెనీకి చెల్లిస్తున్నట్లు కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ తెలియజేసింది. దీనిపై డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ శ్రీ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థ చిత్తశుద్ధితో చేపడుతున్న గని మూసివేత చర్యలకు నిదర్శనంగా కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వారు డిపాజిట్ సొమ్మును తిరిగి కంపెనీకి చెల్లించారని గతంలో ఒక భూగర్భ గనికి (ఆర్కే 8 ఇంక్లైన్, శ్రీరాంపూర్) సంబంధించి రూ.4 కోట్ల డిపాజిట్ ను తిరిగి ఇదే విధంగా చెల్లించారని పేర్కొన్నారు. మూసివేత దశలో ఉన్న మరికొన్ని గనుల్లోనూ ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు పటిష్ట పర్యావరణ హిత చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. త్వరలో మరికొన్ని మూతబడిన గనులకు సంబంధించిన పనులు పూర్తి చేసి ఉన్నందున వాటి డిపాజిట్లు సింగరేణికి అందనున్నాయని పేర్కొన్నారు. డోర్లీ1 గనికి సంబంధించి కూడా తనిఖీలు చివరి దశలో ఉన్న నేపథ్యంలో దానికి సంబంధించి మరో రూ.60 కోట్లకు పైగా డిపాజిట్లు తిరిగి వచ్చే అవకాశం ఉందన్నారు.

## మెడికల్ కాలేజీల్లో తీరనున్న అధ్యాపకుల కొరత

- ఎంపికైన వైద్యుల లిస్టు విడుదల
- వైద్య విద్య ప్రమాణాల మెరుగు దిశగా కీలక అడుగులు




**హైదరాబాద్, జూన్ 10 , అశ్వి అప్డేట్స్:**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత తీర్చడంతోపాటు వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 30 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి చేసింది. ఈమేరకు ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల లిస్టును బుధవారం బోర్డు విడుదల చేసింది. ఈ మెడికల్ కాలేజీలల్లోని 34 విభాగాలకు చెందిన మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బోర్డు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలు అందజేశారు. తాజాగా మిగిలిన 30 డిపార్టుమెంట్లలో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు, సెలక్షన్ లిస్టును ఎంహెచ‌ఎస‌ఆర్‌బీ విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు, నాలుగు స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ జాబితాను కూడా బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్పీచ్ పాథాలజిస్టులకు మంత్రి రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్, ఇతర ఆరోగ్య సంస్థల్లో మానవ వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత రెండున్నరేళ్ల కాలంలో ఆరోగ్య శాఖ పరిధిలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు.

## ‘ఆపరేషన్ క్రాక్‌డౌన్’

- సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ సిఖాగోయల్

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్డేట్స్:**



తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీఈసీఎస్‌బీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు కలిసి ఆపరేషన్ క్రాక్‌డౌన్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా నిందితుల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించాయని సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ సిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాల్లో అరెస్టయిన నిందితుల ప్రస్తుత ఆచూకీని గుర్తించడం, వారిపై నిఘా ఉంచడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో రాష్ట్రంలో నివసిస్తున్న 127 మంది నిందితులను గుర్తించారు. వారిలో 57 మంది రాష్ట్రానికి చెందినవారు, ఇతర రాష్ట్రాల పోలీసులచే వివిధ సైబర్ నేరాల్లో అరెస్టు అయిన వారు. 127 మంది నిందితుల్లో 48 మంది నకిలీ గుర్తింపుతో మోసం చేసేవారు. 27 మంది పెట్టుబడి మోసాలు, 11 మంది డిజిటల్ అరెస్ట్ మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ మూడు రకాల నేరాలు మొత్తం నిందితుల్లో దాదాపు 68% వాటాను కలిగి వున్నాయన్నారు. ఇవే ఇప్పుడు సైబర్ నేరగాళ్ళు అత్యధికంగా వాడుతున్న పద్ధతులని వివరించారు. కాగా, అరెస్టయిన తర్వాత కూడా సైబర్ నేరగాళ్ళను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), తెలంగాణ పోలీసులు సైబర్ మోసాల నుండి ప్రజలను రక్షించేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నేరగాళ్ళపై కఠిన చర్యలు తీసుకోవడానికి సదా సంసిద్ధంగా ఉన్నారన్నారు.

## ప్రైవేట్ కేసును అడ్డంపెట్టుకుని కుట్ర

- మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై ఎంపీ చామల

**హైదరాబాద్,జూన్10, అశ్వి అప్డేట్స్:**




మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ చేశారని విమర్శించారు. బీఎన్ఎస్ యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ.. ఎన్నికలను వాళ్ల ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఈసీని అడ్డం పెట్టుకొని బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లకు అవకాశం ఉందని.. కాంగ్రెస్‌కు ఒక రాజ్యసభ వచ్చే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెడుతోందని ప్రశ్నించారు. ముందు నుంచే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ చూసిందని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయం గురించి దేశ ప్రజలకు తెలియాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు చేస్తే ఎప్పటికీ అధికారంలోకి రారని చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

## ఓటరు నమోదులో ఐటీ వినియోగం పెంచాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశం
- మాస్టర్ ట్రైనర్లు, డేటా ఆపరేటర్లకు శిక్షణ
- ఆన్‌లైన్ ఎన్యూమరేషన్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచన
- తప్పలకు తావులేకుండా పకడ్బందీగా అమలుకు ఏర్పాట్లు

**తెలంగాణ బ్యూరో, జూన్ 10 అశ్వి అప్డేట్స్:**

ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐటీ సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తూ ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు, ఐటీ సపోర్ట్ బృందాలు, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాల రూపకల్పనలో ఐటీ వినియోగం అత్యంత కీలకమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఓటరు నమోదు ప్రక్రియ మరింత వేగవంతం, సమర్థవంతంగా సాగడంతో పాటు పారదర్శకత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఓటర్లు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అందుబాటులో ఉంచిన వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ అభివృద్ధి చేసిన ఈసీనెట్, బీఎల్‌ఓ యాప్‌ల ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత సులభతరం చేసే పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవస్థల వినియోగంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటీ సపోర్ట్ బృందాలు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్లకు ఆన్‌లైన్ ఎన్యూమరేషన్ సౌకర్యంపై విస్తృత అవగాహన కల్పించాలని కూడా సూచించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను వివరించారు. పీఎంఐటీ డి. చిరంజీవి ఈసీనెట్, బీఎల్‌ఓ యాప్‌ల వినియోగంపై సాంకేతిక శిక్షణ అందించారు. ఎన్యూమరేషన్ ఫారాల నమోదు, ఓటర్ల మ్యాపింగ్, సేకరించని ఫారాల వర్గీకరణతో పాటు ఇతర ప్రక్రియలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

## స్థిరాస్థి వ్యాపారి అరుణ్ కుమార్ దురాగతం

- భార్యపై అనుమానంతో కాల్పులు
- అక్కడిక్కడే మృతి చెందిన ఇల్లాలు

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్డేట్స్:**




ఓ స్థిరాస్తి వ్యాపారి అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తితో కలిసి తెల్లవారుజామున ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషారాణిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. 3 నెలల క్రితం అంబర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరుణ్‌కుమార్ తుపాకీతో పోలీసులకు చిక్కాడు. తుపాకీ సీజ్ చేయడంతో పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసి దారుణానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

## రేవంత్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు

- తెలంగాణలో ఇక బిజెపిదే తదుపరి అధికారం
- బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ జోస్యం

**భువనగిరి, జూన్ 10, అశ్వి అప్డేట్స్ :**



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ వి□డియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు వి□నాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో□ కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.



## కోలివింగ్ హాస్టళ్లపై విచారణ చేయాలి

- ప్రభుత్వానికి విహెచ్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్డేట్స్:**

ప్రస్తుత సమాజంలో యువతీ యువకులు కలిసి ఉండే ’కో లివింగ్ హాస్టల్స’ సంస్కృతిపై సర్వత్రా చర్చ నడుస్తున్న వేళ.. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హాస్టల్స్ నిర్వహణ తీరు, అక్కడ అసలు ఏం జరుగుతోంది, యువత ఏ విధంగా ప్రభావితమవుతోంది అనే అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం నడుస్తున్న కో`లివింగ్ హాస్టల్‌స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాలి. అక్కడ చోటుచేసుకుంటున్న పరిస్థితులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. అలా చేసిన తర్వాతే వాటిని పూర్తిగా రద్దు చేయాలా? లేక కఠినమైన నిబంధనలను అమలు చేయాలా? అన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఇలాంటి హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే సమాజంలో, వి□డియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కో`లివింగ్ హాస్టల్‌స్‌లో అమ్మాయిల తప్పా? లేక అబ్బాయిల తప్పా? తెలుసుకోవాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి’ అని అన్నారు.

## వికసిత్ భారత్‌వైపు దూసుకుపోతోంది

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్డేట్స్ :**

దేశ చరిత్రలోనే అత్యధిక కాలం ప్రజల చేత ఎన్నికైన ప్రధానమంత్రిగా నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ ఒక కొత్త చరిత్ర సృష్టించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. సుమారు 4,399 రోజుల పదవీ కాలాన్ని పూర్తి చేసి జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును దాటి అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న నేతగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారన్నారు. ఈ అరుదైన ఘనతను పురస్కరించుకుని మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లో గల శివాలయంలో రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ ప్రజాసేవ, సుశాసనం, దేశ భద్రత.. ఇలా ప్రతి విషయంలోనూ మోదీ దేశాన్ని ప్రపంచ వేదికపై తలెత్తుకునేలా చేస్తున్నారని కొనియాడారు. గత పన్నెండేళ్లలో భారత్‌ను ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనంటూ ఆయన నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ వైపు దూసుకుపోతోందన్నారు. మోదీ సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో ఉండి దేశానికి మరింతకాలం సేవలందించాలని, దేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో, మండలంలో బీజేపీ కార్యకర్తలు ఈ రోజును ఒక పండుగలా జరుపుకుంటున్నారన్నారు. మోదీ పై దేవుని ఆశీస్సులు, ప్రజల దీవెనలు ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ సంబరాల్లో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ రామచందర్‌రావు ధన్యవాదాలు తెలియజేశారు.



## గ్రామాల్లో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం: డీఎస్పీ నల్లపు లింగయ్య

- **రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి – మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు.**
- **త్వరలో "మన గ్రామం–మన పోలీస్" కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రారంభిస్తాం.**
- **మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపు.**

**ఆశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 10**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా సింగారం గ్రామంలోని మహిళా సమైక్య భవనంలో నిర్వహించిన గ్రామసభకు డీఎస్పీ నల్లపు లింగయ్య ముఖ్య అతిథిగా హాజరై Arrive Alive కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, మహిళల భద్రత, గ్రామ శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ... గ్రామాల్లో శాంతిభద్రతలు సక్రమంగా ఉన్నప్పుడే ఆ గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామ ప్రజలందరూ పరస్పర సహకారంతో, చట్టాలను గౌరవిస్తూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు.

**Arrive Alive క్షేమంగా చేరుకోండి... జీవించండి**

భాగంగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించిన ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, నారాయణపేట జిల్లాలో కూడా వందకు పైగా ప్రాణనష్టాలు సంభవిస్తున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్న డీఎస్పీ, అటువంటి ఘటనల్లో తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.



## వెలిమినేడు గ్రామ సభలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన డిజిపి వి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ..

- **"వేగం కాదు... ప్రాణాలతో గమ్యానికి చేరుకోవడమే ముఖ్యం"**

**అశ్వి అప్డేట్స్**

ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో గ్రామ సభ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిజిపి టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్ మరియు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిజిపి వి.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ప్రతి కుటుంబాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ఒక కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి, పిల్లల భవిష్యత్తు, కుటుంబ సభ్యుల జీవన విధానం పూర్తిగా దెబ్బతింటుందని అన్నారు. సమయం లేదనే తొందర, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధిక వేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రత్యేకంగా యువతలో ఓవర్ కాన్ఫిడెన్స్ డ్రైవింగ్ పెరుగుతోందని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల మరణాల శాతం అధికంగా ఉంటోందని తెలిపారు. అధిక వేగం, తప్పు దారిలో వాహనాలు నడపడం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా 90 శాతం ప్రమాదాల్లో తీవ్ర గాయాలు, మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రాణాంతకమని హెచ్చరించారు. "వేగంగా వెళ్లడం ముఖ్యంకాదు - ప్రాణాలతో గమ్యస్థానానికి చేరుకోవడమే ముఖ్యము" అని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన మొదటి గంటను "గోల్డెన్ అవర్"గా పేర్కొంటూ, ఆ సమయంలో బాధితుడిని ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స నిమిత్తం రూ.1,50,000 వరకు క్యాష్‌లెస్ చికిత్స అందించే విధానంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. రాష్ట్ర డిజిపి ఆధ్వర్యంలో ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్డు సేఫ్టీ ద్వారా రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు.

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టిందన్నారు. వెలిమినేడు గ్రామ పరిధిలో 2023 సంవత్సరంలో ప్రమాదాల ద్వారా 16 మంది మరణించగా, 2024లో 13 మంది, 2025లో 9 మంది, ఈ సంవత్సరం ఇప్పటి వరకు కేవలం ఇద్దరు మాత్రమే మరణించారని తెలిపారు. రోడ్లలోని లోపాలను గుర్తించి సరిచేయడం, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఇంజనీరింగ్ మార్పులు, రోడ్డు మరమ్మత్తులు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు, లైటింగ్ వంటి చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. "ప్రమాదం ఎప్పుడు, ఎలా జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. మనం జాగ్రత్తగా ఉన్నా ఎదుటివారి నిర్లక్ష్యం ప్రమాదానికి కారణమవుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ నేర్చుకోవాలి" అని ఎస్పీ సూచించారు. మన తప్పు వల్ల ఇతరులు ఇబ్బంది పడకూడదనే సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

అనంతరం వెలిమినేడు గ్రామ సర్పంచ్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా రోడ్డు ప్రమాదాల నివారణకు సామాజిక బాధ్యతగా కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఇకపై గ్రామంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని గ్రామస్థులతో కలిసి తీర్మానం చేశారు.

కార్యక్రమం అనంతరం డ్రైవర్ల, గ్రామ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని డిజిపి, ఎస్పీ సందర్శించి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరుణ్ రెడ్డి, ఎస్బి సీఐ ఆది రెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐలు రవి కుమార్, విష్ణు, డిటిఆర్బి రిటైర్డ్ సీఐ అంజయ్య, ఇతర పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలు, యువత, డ్రైవర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా 'అలైవ్ – అరైవ్' కార్యక్రమం

**అశ్వి అప్డేట్స్**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, గ్రామ సభ ల లో భాగంగా నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే 'అలైవ్ - అరైవ్' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ మల్టీ జోన్ - 2 ఐజిపి శ్రీ షానవాజ్ ఖాసిం గారు ముఖ్య అతిథిగా హాజరుకాగా, వికారాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ గారు, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా గారు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా గౌరవ ఐజిపి శ్రీ షానవాజ్ ఖాసిం గారు మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లోనూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సేఫ్ డ్రైవింగ్ పట్ల పిల్లలకు, పెద్దలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మన ఇళ్ల నుంచే మార్పు మొదలుకావాలని, ప్రతి ఒక్కరూ 'అరైవ్ అలైవ్' ప్రాముఖ్యతను గుర్తించాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ పూనాలని, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతోనే వంద శాతం విజయం సాధిస్తాయని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ.. వికారాబాద్‌ను ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచే 'నో హెల్మెట్ నో ఎంట్రీ', 'నో డ్రంక్ అండ్ డ్రైవ్' లాంటి నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, . అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజల భద్రత కోసమే పనిచేస్తున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ గారు మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రయాణంలో గమ్యం కంటే విలువైన ప్రాణాల రక్షణే ముఖ్యమని, కుటుంబ యజమాని ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీలు ప్రమాదాల తగ్గింపునకు నిరంతరం కృషి చేస్తాయని తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులు వంద శాతం నిఘా ఉంచాలని, పిల్లలు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. ప్రతి నెలా రోడ్డు భద్రతా కమిటీల ద్వారా సమావేశాలు నిర్వహించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. 'అలైవ్ అరైవ్' కార్యక్రమాన్ని జిల్లాలోని మారుమూల గ్రామాల వరకు తీసుకెళ్లేలా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరిస్తే ప్రమాదాల నుండి ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. "మనకు తెలియకుండా జరిగేది యాక్సిడెంట్.. తెలిసి చేసేది నిర్లక్ష్యం" అని, అతివేగం, అజాగ్రత్తే ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. పిల్లలకు వాహనాలు కొనిచ్చే ముందు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి అధికారులు , సర్పంచ్ లు తమ గ్రామం లో నో హెల్మెట్ నో ఎంట్రీ, నో డ్రింక్ & డ్రైవ్ కార్యక్రమాలు మొదలు పెట్టి, ప్రమాదాల నివారణలో తమ పాత్ర పోషించాలని ఎస్పీ గారు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా 'సురక్ష మిత్ర' లోగోలు, వాల్ పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు వీడియో ల ద్వారా అవగాహన కల్పించారు, ప్రజలతో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించి, ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. సురక్షిత ప్రయాణం పై వాయిస్ ఓవర్లు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ అవగాహన సదస్సులో డీపీఓ జయసుధ, డీఎస్పీ అంజయ్య, సీఐ వెంకట్, రఘు రాములు, స్థానిక ఎస్సైలు, ఎంపీడీఓ అనురాధ, ఏఓ జ్యోతి, సర్పంచుల సంఘం అధ్యక్షులు బాల్వంత్ రెడ్డి, సర్పంచులు నర్సింహా రెడ్డి, శేఖర్, జగన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, యువకులు, రాజకీయ నాయకులు మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- **విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో పోగాలు ఉత్పత్తులు అమ్మవద్దు***
- **విద్యార్థులకు, పిల్లలకు పోగాకు ఉత్పత్తులు అమ్మవద్దు.**

**సూర్యాపేట, జూన్ 10, 2026, అశ్వి అప్డేట్స్:**




విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు, మత్తు పదార్థాల విక్రయాలను నిరోధించేందుకు సూర్యాపేట జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ నరసింహ (IPS) గారి ఆదేశాల మేరకు, మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి వరకు జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

**తనిఖీల ముఖ్య ఉద్దేశ్యం**

పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం అవుతున్న తరుణంలో, విద్యార్థులను చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం మరియు వారికి ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ఈ తనిఖీల ప్రధాన లక్ష్యం.

**పోలీసు శాఖ చేపట్టిన చర్యలు:**

విస్తృత తనిఖీలు:* జిల్లా కేంద్రంతో పాటు అన్ని ముఖ్య పట్టణాలు, గ్రామాల్లోని విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు.

దుకాణదారులకు హెచ్చరికలు:* విద్యాసంస్థలకు సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలు విక్రయించకూడదని దుకాణదారులను హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**అవగాహన కల్పన:** మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకునే ప్రమాదం ఉందని, పిల్లలకు ఇవి అందుబాటులో లేకుండా చూడాలని దుకాణదారులకు పోలీసులు సూచించారు.

**సామాజిక బాధ్యత:*** భావి భారత పౌరులైన విద్యార్థులకు ఆరోగ్యవంతమైన సమాజం, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.

**పోలీసు అధికారుల విజ్ఞప్తి:**

విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం చట్టరీత్యా నేరం. దుకాణదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, విద్యాసంస్థల సమీపంలో ఇటువంటి అమ్మకాలను నిలిపివేయాలని జిల్లా పోలీస్ యంత్రాంగం కోరింది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారిని మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## వినాయక నగర్ వద్ద చోటు చేసుకున్న దారుణ ఘటన.!

కడప నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో బుధవారం దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ పసికందును ఎవరో తల్లిదండ్రులు ముళ్ళ పొదల్లో వదిలేసి పోయారు. కుక్కలు కొన్ని పసికందును ఎత్తుకెళ్తుండగా స్థానికులు గమనించి కుక్కను తరిమికొట్టారు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు స్థానికులు కొందరు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల నివారణ, ఛేదనను వేగవంతం చేయడం లక్ష్యం

**అశ్వి అప్డేట్స్**

వికారాబాద్ జిల్లా ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల నివారణ, ఛేదనను వేగవంతం చేయడం లక్ష్యంగా రూపొందించిన "వికారాబాద్ రక్షణ నేత్రం" జిల్లా స్థాయి సీసీటీవీ బలోపేతం మరియు విస్తరణ కార్యక్రమాన్ని నేడు మొమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ మల్టీ జోన్2 ఐజీపీ శ్రీ షానవాజ్ ఖాసీం గారు, జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ , జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 110 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరవ మల్టీ జోన్2 ఐజీపీ శ్రీ షానవాజ్ ఖాసీం గారు మాట్లాడుతూ, ఆధునిక పోలీసింగ్‌లో సీసీటీవీ నిఘా వ్యవస్థ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రతి కీలక ప్రాంతాన్ని సీసీటీవీ పర్యవేక్షణలోకి తీసుకురావడం ద్వారా నేరాలను నివారించడంతో పాటు, నేరస్తులను వేగంగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు వీలవుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అమలవుతున్న "వికారాబాద్ రక్షణ నేత్రం" కార్యక్రమం ఆదర్శ ప్రాజెక్టుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ గారు మాట్లాడుతూ, ప్రజల భద్రత అందరి బాధ్యత అని, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీసీటీవీ కెమెరాలు నేర నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తాయని, జిల్లాలో ప్రతి గ్రామాన్ని "సురక్షిత గ్రామం" గా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS గారు మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం




ఉన్న సీసీటీవీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "మన గ్రామం - మన భద్రత" అనే నినాదంతో ప్రజల సహకారాన్ని పొందుతూ జిల్లా వ్యాప్తంగా సీసీటీవీ నెట్‌వర్క్‌ను విస్తరించనున్నామని చెప్పారు. అలాగే ప్రధాన రహదారులు, జిల్లా సరిహద్దులు, ప్రమాదకర ప్రాంతాల్లో ANPR కెమెరాలు ఏర్పాటు చేసి వాహనాల ట్రాకింగ్, దొంగిలించిన వాహనాల గుర్తింపు, హిట్ అండ్ రన్ కేసుల దర్యాప్తు మరింత సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా సీసీటీవీ కవరేజీ పెరగడం, నేరాల నివారణ, రోడ్డు భద్రత మెరుగుపడటం, ప్రజల భాగస్వామ్యం పెరగడం, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ బలోపేతం కావడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం: డిఎస్పీ నల్లపు లింగయ్య

**ఆశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 10**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈగల్ ఫోర్స్ టీం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటవీ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త అధికారులు, విద్యార్థులు కలిసి నారాయణపేట జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ మరియు మత్తు పదార్థాల బారిన పడి అనంతరం డిఅడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స పొంది సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చిన సుమారు 20 మంది యువకులతో కలిసి అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ... యువత దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎన్ఫోర్స్మెంట్ మరియు అవగాహనతో డ్రగ్స్ ను నియంత్రించడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని తెలిపారు. డిఅడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స పొంది తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చిన యువకులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, వారి అనుభవాలను ఇతరులతో పంచుకుని డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందించినట్లు తెలిపారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, ఉపాధి, క్రీడలు మరియు సమాజ సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా, ఎవరైనా మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంలో పాల్గొంటున్నట్లు గమనించినా వెంటనే టోల్ ఫ్రీ 1908 లేదా డయల్ 100 కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ లు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, RI విజయ్ భాస్కర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ Dr. సంపద కుమార్ సింగ్, డాక్టర్ కిరణ్ ప్రకాష్, RMO రాఘవేందర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, నరేష్, ఆంజనేయులు, శివ శంకర్, శిరీష, ఈగల్ ఫోర్స్ టీం, అటవీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, డిఅడిక్షన్ సెంటర్ ప్రతినిధులు, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# సమస్యల వలయంలో పెద్దగుండవెల్లి

- **మౌలిక వసతుల కొరతతో ప్రజల అవస్థలు**

**ఆశ్వి అప్డేట్స్, దుబ్బాక**





పెద్దగుండవెల్లి పేరుకు పెద్ద గ్రామమైన పెద్దగుండవెల్లి అనేక సమస్యలతో సతమతమవుతోంది. గ్రామంలో విద్యుత్, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, గృహ పట్టాలు, దేవాలయ నిర్వహణ వంటి పలు అంశాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు...**

గ్రామంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించిన పట్టాలు ఇప్పటికీ పలువురు అర్హులకు అందలేదని గ్రామస్థులు చెబుతున్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పట్టాల పంపిణీ చేయడంలో రెవెన్యూ శాఖ విఫలమైందని విమర్శిస్తున్నారు.

**ఇరుకుగా ప్రధానరహదారి**

గ్రామంలోని కొన్ని కాలనీలకు సరైన రోడ్లు లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కూడా ఇరుకుగా ఉండటంతో రెండు ట్రాక్టర్లు ఎదురెదురుగా వెళ్లే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. ఇటీవల ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ రహదారిపై ఇరుక్కుపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఎన్నిసార్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా ఆర్ అండ్ బి శాఖ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**భక్తుల నుంచి అధిక వసూళ్లు**

గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో భక్తుల నుంచి అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్నం వేయించుకోవాలంటే వేల రూపాయలు, ఇతర పూజా కార్యక్రమాలకు కూడా భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని భక్తులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై దేవాలయ కమిటీ స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు, అక్కడికి వచ్చే భక్తులు కోరుతున్నారు.

**పంట పొలాలను నాశనం చేస్తున్న పందులు**

ఇక గ్రామం చుట్టూ ఊరపందులు గుంపులుగా సంచరిస్తూ పంట పొలాలను నాశనం చేయడమే కాక ప్రజల ఆరోగ్యానికి కూడా ముప్పుగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి గ్రామ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**డబుల్ బెడ్రూం కాలనీలో త్రాగు నీటి అవస్థలు**

గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్నా డబుల్ బెడ్రూం కాలనీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు లేక మురికినీరు నిల్వ ఉండడంతో దోమలు, దుర్వాసన సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను సంబంధిత శాఖలు తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని పెద్దగుండవెల్లి వాసులు కోరుతున్నారు.

# సీక్రెట్ డేటింగ్ యాప్స్ ముప్పు..

- **కుటుంబ బంధాలను కుదేలు చేస్తున్న 'రహస్య సంబంధాల' ట్రెండ్!**

**జూన్ 10, 2026, అశ్వి అప్టేట్స్ :**



దేశంలో సీక్రెట్ డేటింగ్ యాప్స్ పేరిట శృంగార వేట ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందన్న నివేదికలు సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. డిజిటల్ యుగంలో గోప్య సంబంధాల కోసం రూపొందిన కొన్ని యాప్స్ వినియోగం భారీగా పెరుగుతుండటం కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వివాహితులను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న ప్రైవేట్ డేటింగ్ ప్లాట్‌ఫార్మ్‌లు, గోప్య పరిచయ యాప్స్ కారణంగా వివాహేతర సంబంధాలు, కుటుంబ విభేదాలు పెరుగుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలు మార్కెట్ అంచనాలు, డిజిటల్ ట్రెండ్ నివేదికల ప్రకారం గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 4.5 కోట్ల మంది గోప్య పరిచయాలు, వ్యక్తిగత సంబంధాల కోసం ఈ తరహా యాప్స్‌లో చేరినట్లు సమాచారం. అందులోనూ ఒక్క గత ఏడాదిలోనే సుమారు 1.6 కోట్ల మంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం కలకలం రేపుతోంది. ఈ సంఖ్యలు యువతతో పాటు వివాహితుల్లో కూడా ఈ యాప్స్ వినియోగం వేగంగా పెరుగుతోందని సూచిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పెళ్లైన వారే ఎక్కువగా ఈ యాప్స్‌కు బానిసలవుతూ వివాహేతర సంబంధాల వైపు మళ్లుతున్నారని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రారంభంలో సాధారణ చాటింగ్, స్నేహం పేరిట మొదలయ్యే పరిచయాలు క్రమంగా భావోద్వేగ, ఆర్థిక, శారీరక సంబంధాలుగా మారి కుటుంబ బంధాల్లో చీలికలకు దారి తీస్తున్నాయని సామాజిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దాంపత్య జీవితంలో కమ్యూనికేషన్ లోపం, భావోద్వేగ దూరం, ఒంటరితనం, సోషల్ మీడియా ప్రభావం కూడా ఈ ధోరణి పెరగడానికి కారణాలుగా గుర్తిస్తున్నారు. ఇటీవలి కాలంలో వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్యలు, ఆత్మహత్యలు, గృహహింస, బ్లాక్‌మెయిల్, ఆన్‌లైన్ మోసాలు వంటి ఘటనలు దేశవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్నాయి. గోప్య పరిచయాల పేరిట వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు సేకరించి డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నట్లు సైబర్ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రతి డేటింగ్ యాప్ లేదా ఆన్‌లైన్ పరిచయం తప్పనిసరిగా ప్రమాదకరమేనని భావించడం సరైంది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కానీ ఈ భయంకరమైన ట్రెండ్ ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో కుటుంబ బంధాలను నట్టేట ముంచే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని పలు సామాజిక నివేదికలు హెచ్చరిస్తున్నాయి. కుటుంబాల్లో పరస్పర నమ్మకం, స్పష్టమైన సంభాషణ, భావోద్వేగ అనుబంధం బలంగా ఉంటే ఇలాంటి ప్రభావాలను తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. డిజిటల్ ప్రపంచంలో సంబంధాల స్వరూపం మారుతున్న తరుణంలో సాంకేతికత వినియోగంలో బాధ్యత, వ్యక్తిగత భద్రత, కుటుంబ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం మరింత పెరిగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## వనస్థలిపురం డివిజన్‌లో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులకు వినతి

**అశ్వి అప్టేట్స్**



వనస్థలిపురం డివిజన్ పరిధిలో నెలకొన్న తీవ్రమైన మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బి.ఆర్.ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు శ్రీ చింతల రవి కుమార్ గారి ఆధ్వర్యంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) శ్రీ నాగరాజు గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా చింతల రవి కుమార్ మాట్లాడుతూ, వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగకపోవడం, తక్కువ ఒత్తిడితో నీరు రావడం, సరఫరా సమయాలు పాటించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు నిత్యావసరమైన తాగునీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

అదేవిధంగా ప్రజల అవసరాల కోసం సరఫరా చేయాల్సిన నీటి ట్యాంకర్లను కొందరు వ్యక్తులు అక్రమంగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ప్రజల నుండి వస్తున్నాయని, ప్రజల దాహాన్ని ఆసరాగా చేసుకుని నీటిని వ్యాపారంగా మార్చడం అత్యంత దురదృష్టకరమైన మరియు ఖండనీయమైన విషయమని పేర్కొన్నారు.


కావున వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో తక్షణమే పరిస్థితిని సమీక్షించి, అవసరమైన ప్రాంతాలకు అదనపు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయడంతో పాటు తగిన ఒత్తిడితో నిరంతరాయంగా మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కోరారు. అలాగే ట్యాంకర్ల ద్వారా నీటిని అక్రమంగా విక్రయిస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కొలిశెట్టి సంజయ్ కుమార్ గారు, వర్కింగ్ అధ్యక్షులు లగోని శ్రీధర్ గౌడ్ గారు, ప్రశాంతనగర్ కాలనీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి గారు శ్రీనివాస పురం కాలనీ అధ్యక్షులు దూసరి మధు గౌడ్ గారు, ఫేస్2హుడాకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ రాజ్ గారు, ప్రశాంత్ నగర్ ప్రధాన కార్యదర్శి బాబురావు గారు, గడాల రాజు గారు, పి.వి. నరసింహరావు గారు, మిట్ట రామ్మోహన్ గారు, శ్రీనివాసరావు గారు, అశోక్ గారు, రవికాంత్ గారు, ప్రకాష్ గారు, విజయ్ కుమార్ గారు తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్

- **అక్టోబర్ 8 నుంచి 18 వరకు పీపుల్స్ ప్లాజా వేదికగా ఏపీఎల్-2 పోటీలు**
- **11 రోజుల పాటు సాగే లీగ్‌లో పోటీ పడనున్న ప్రపంచ ఉత్తమ ఆర్చర్లు**

**హైదరాబాద్, జూన్ 10, అశ్వి అప్టేట్స్:**




హైదరాబాద్ నగర క్రీడా మైదానంలో మరో ప్రతిష్ఠాత్మక లీగ్‌కు తెరలేవనుంది. దేశంలోనే మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత ఆర్చరీ టోర్నమెంట్ 'ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌కు భాగ్యనగరం ఆతిథ్యమివ్వడానికి సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 8 నుంచి 18 వరకు ఐనెక్స్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వేదికగా 11 రోజుల పాటు ఈ క్రీడా సంబరం జరగనుంది. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సహకారంతో జరగబోయే ఈ మెగా ఈవెంట్‌లో ప్రపంచస్థాయి విలువిద్యగాళ్లు తమ గురిని పరీక్షించుకోనున్నారు. ఈ లీగ్‌లో మొత్తం 6 ఫ్రాంచైజీ జట్లు (మైటీ మరాఠాస్, రాజ్‌పుతానా రాయల్స్, పృథ్వీరాజ్ యోధాస్, కాకతీయ నైట్స్, చేరో ఆర్చర్స్, చోళ చీఫ్స్) తలపడనున్నాయి. భారత్‌కు చెందిన స్టార్ ఆర్చర్లు దీపికా కుమారి, అతాను దాస్, ఓజాస్ డియోతాలే, జ్యోతి సురేఖ, అభిషేక్ వర్మలతో పాటు పలువురు ఒలింపిక్, ప్రపంచ ఛాంపియన్లు ఈ టోర్నీలో భాగం కానున్నారు. పురుషులు, మహిళలతో పాటు రికర్వ్, కాంపౌండ్ విభాగాల ఆర్చర్లు కలిసి ఆడేలా ఈ పోటీలను వినూత్నంగా డిజైన్ చేశారు. ముఖ్యంగా ఒలింపిక్స్ కంటే భిన్నంగా ఇందులో ప్రవేశపెట్టిన 15 సెకన్ల షాట్ క్లాక్ (షూటింగ్ సమయం) ఆటలో వేగాన్ని, ఉత్కంఠను మరింత పెంచనుంది. దేశంలో ఆర్చరీ క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గతేడాది న్యూఢిల్లీలో ప్రారంభమైన ఈ లీగ్, ఇప్పుడు హైదరాబాద్ వేదికగా మరింత గ్రాండ్‌గా సాగనుందని లీగ్ డైరెక్టర్ అనిల్ కామినేని తెలిపారు. డబుల్ రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో సాగే ఈ టోర్నీలో టాప్ 4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా రాజ్‌పుతానా రాయల్స్ బరిలోకి దిగుతుండగా, టోర్నీకి సంబంధించిన షెడ్యూల్, ఆటగాళ్ల వేలం, ప్రత్యక్ష ప్రసార వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్, ఏపీఎల్ డైరెక్టర్ వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌లో ఇండియా ఆర్చెరి విజయాల మార్గాన్ని మరింత బలోపేతం చేయాలనే ఒక పెద్ద విజన్‌తో ఏపీఎల్‌కు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై మన అథ్లెట్లు పతకాల కోసం నిలకడగా పోటీ పడాలంటే, వారికి అత్యున్నత స్థాయి పోటీల అనుభవం క్రమంతప్పకుండా అవసరమని, లీగ్ ద్వారా అదే అందించడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.



## సెర్ఫ్ పారా మీటర్లను మెరుగు పరచాలి

- **జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

**ఆశ్వి అప్డేట్:**

**నారాయణపేట జూన్ 10, అశ్వి అప్టేట్స్**

సెర్ఫ్ పారా మీటర్లను మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్త్రీనిధి సమీక్షా కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, నిరర్థక ఆస్తుల (NPA) రికవరీపై ఎస్ఎన్ఆర్సి (SNRC) కమిటీ సభ్యులు, డిపిఎంలు, ఎపిఎంలు, సిసిలు, జెడ్ఎంఎస్ ఓబిలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని సిసిలందరికీ సూచించారు. అలాగే గ్రూప్ యూనిట్లను గుర్తించాలని, ఇప్పటికే జిల్లాకు షీ మార్ట్ మంజూరు చేయబడిందని తెలిపారు. అన్ని సెర్ఫ్ (SERP) పారామీటర్లను మెరుగుపరచాలని ఆదేశించారు. జిల్లా లో ఏర్పాటు చేసిన కిషోర బాలికల సంఘాలలో ప్రతిభ కలిగిన అమ్మాయిలను ఎంపిక చేసి ఫోటో గ్రఫి, కంప్యూటర్ శిక్షణ కోసం హైదరాబాద్ పంపించేలా చూడాలని డిఆర్డీఏ వెంకట్ రాములు కు సూచించారు. జిల్లాకు హ్యాండ్ లూమ్ టెక్స్ టైల్ కూడా రాబోతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లాకు మంజూరైన షీ మార్ట్ లో ఏ ఏ ఉత్పత్తులు పెట్టాలో జాబితా తయారు చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రం లోని వెజ్ నాన్ వెజ్ మార్కెట్ లో వారానికి ఒక రోజు (శుక్రవారం) మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన/ విక్రయం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. అలాగే మండలాల వారీగా స్కూల్ యూనిఫాం కోసం వచ్చిన బల్క్ క్లాత్ ను వెంటనే పంపించి, స్టిచ్చింగ్ బాధ్యత ను ఏపీఎం లు, సీసీ లు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. మండలానికి ఒక మాస్టర్ ట్రైనర్ ఉంటారని, యూనిఫాం కొలతల హెచ్చు తగ్గులను ఆయన సరి చేస్తారని, పాఠశాలల హెచ్ ఎం, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని యూనిఫాం లను పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీపిఎంలు, ఏ పీ ఎం లు, సీ సీ లు, ఓ బీ లు పాల్గొన్నారు.



## అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ నివారణకై అవగాహన కార్యక్రమం

**అశ్వి అప్టేట్స్**

మల్కాజిగిరి కమిషనరేట్ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నాలుగోవ విడతలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ నివారణకై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి కమిషనర్ సుమతి ఐపీఎస్ పాల్గొన్నారు

రోడ్డు భద్రత విషయంలో ప్రజలకు అవగాహన కల్పించలనే ముఖ్య ఉదేశం తో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కుంట్లూరు చౌరస్తాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో నివారణ చర్యలో భాగంగా ఇక్కడ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు ఈ కార్యక్రమంలో అన్ని రకాల అధికారులు Rto, rtc, రోడ్డు సేఫ్టీ, నేషనల్ హైవే అథారిటీ, వైద్య అధికారులు పాల్గొన్నారాని అన్నారు ఆక్సిడెంట్ లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు మన ప్రాణం మన చేతుల్లో ఉందని సరైన అవగాహన చర్యలు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మద్యం సేవించి వాహనం నడపడం ఇలాంటి చిన్న చిన్న వాటితో మన ప్రాణాన్ని మనం కాపాడుకోవచ్చని అన్నారు రోడ్డు భద్రత కల్పించి ఆక్సిడెంట్లను నివారించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు.



## ఘనంగా నందమూరి బాలకృష్ణ 66వ జన్మదిన వేడుకలు

- **66 మంది చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు పంపిణీ చేసిన మంత్రి సవిత..**

**పెనుకొండ , జూన్ 10, అశ్వి అప్టేట్స్:**

ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గారి 66వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పెనుకొండ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో 66వ జన్మదినాన్ని గుర్తుచేస్తూ 66 మంది చిరు వ్యాపారస్తులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ సహాయాన్ని అందజేసినట్లు మంత్రి సవితమ్మ తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ ప్రజాసేవా కార్యక్రమాలు, హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు.మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, బాలకృష్ణ సేవా దృక్పథానికి గుర్తుగా నిరుపేదలకు తోపుడు బండ్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పించి వారి జీవనోపాధికి తోడ్పడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.







# గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం: డీజీపీ సి.వి. ఆనంద్

- **ఆదిలాబాద్ పర్యటనలో పలు అభివృద్ధి, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న డీజీపీ**

**ఆదిలాబాద్, జూన్ 10, అశ్వి అప్డేట్స్:**

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శ్రీ సి.వి. ఆనంద్ బుధ వారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి ప్రజా భద్రత, రోడ్డు భద్రత అవగాహన, మాదకద్రవ్యాల నియంత్రణ, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పోలీస్ అతిథి గృహంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో డీజీపీ పాల్గొని మొక్కలు నాటారు. ఆ తర్వాత చిల్డ్రన్ పార్క్ ను ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ ను ప్రారంభించారు. గాంజా, డ్రగ్స్ లాంటి మారకద్రవ్యాలకి బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న అడిక్షన్ సెంటర్ ని సందర్శించారు.

**సేఫ్ ఆదిలాబాద్ లక్ష్యంగా సమీకృత సీసీటీవీల ఏర్పాటు**

ఆదిలాబాద్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమీకృత సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థను డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ ప్రారంభించారు. నాందేడ్, నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దుకు అనుసంధానంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లా వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని అధికారులు వివరించారు. ఈ ప్రాంతాల మధ్య వాహనాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత బలోపేతంలో సీసీటీవీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జిల్లా పోలీసులు చేసిన సీసీటీవీల ఏర్పాటును డీజీపీ అభినందించారు. హైదరాబాద్, సైబరాబాద్ నగరాల మాదిరిగా ఆదిలాబాద్ జిల్లాను కూడా సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా కేంద్రాలతో పాటు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను విస్తరించాలని అధికారులకు సూచించారు.

జిల్లా ఎస్పీ శ్రీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఇటీవల 300 కొత్త సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఆదిలాబాద్ పట్టణంలో మొత్తం కెమెరాల సంఖ్య 600కు చేరిందని తెలిపారు. అలాగే జిల్లా గ్రామాల్లో 1,200కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటన్నింటినీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఘటనలపై తక్షణ స్పందన సాధ్యమవుతుందని వివరించారు.

**జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం**

జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో డీజీపీ సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ, పట్రోలింగ్ వ్యవస్థ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. నేర నియంత్రణలో ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు యాంటీ నార్కోటిక్స్ అండ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతిరోజూ నిర్దిష్ట సమయాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి కేటాయించాలని ఆదేశించారు. పోలీసుప్రజల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరాల దర్యాప్తులో పోలీసు డాగ్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కూడా సూచించారు.

**తోష గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం**

గుడిహత్నూర్ మండలంలోని తోష గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. గ్రామసభలో గ్రామ పెద్దలు, సర్పంచ్, వార్డు సభ్యులు, యువతతో కలిసి మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలి**

రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యత అని పేర్కొన్న డీజీపీ, ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని అర్హులైన వ్యక్తులకు పోలీసు, రవాణా శాఖల సహకారంతో లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రంగవల్లి పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్ల విజేతలకు బహుమతులు అందజేశారు.

**సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లు**

తెలంగాణ ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద సమస్యను విజయవంతంగా ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లుగా మారాయని డీజీపీ పేర్కొన్నారు.

గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో 7,800 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక మరణాలను నివారించవచ్చని తెలిపారు. "వేగం ఉత్సాహాన్ని ఇవ్వొచ్చు, కానీ అదుపు కోల్పోతే ప్రాణాలను తీస్తుంది. ట్రాఫిక్ నిబంధనలను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదు" అని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గాయని డీజీపీ కి జిల్లా ఎస్పీ వివరించారు. గత సంవత్సరం జనవరి నుంచి మే వరకు 72 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, ఈ ఏడాది జనవరి మే చివరి నాటికి సంఖ్య 48కు తగ్గిందన్నారు.

అవగాహన కార్యక్రమాలు, పోలీసు, రవాణా శాఖలు, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. 24 మంది ప్రాణాలు కాపాడటం అంటే 24 కుటుంబాలను విషాదం నుంచి రక్షించినట్టేనని తెలిపారు.

**డ్రగ్స్ ప్రమాదాలపై హెచ్చరిక**

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు వ్యవసాయం, పరిశ్రమలు, దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలో లో నంబర్ 1 స్థానంలో పంజాబ్ రాష్ట్రం డ్రగ్స్ ప్రభావంతో 21 స్థానానికి పడిపోయింది. నేడు పంజాబ్ సామాజికంగా, ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. తెలంగాణ యువత అలాంటి పరిస్థితులు రాకుండా విద్య, ఉపాధి, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం వైపు దృష్టి సారించాలని సూచించారు.

**సురక్షిత సమాజ నిర్మాణానికి అందరూ కలిసి పనిచేయాలి**

రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని డీజీపీ పిలుపునిచ్చారు. జాతీయ రహదారుల వెంట భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, యాంటీ నార్కోటిక్స్ చర్యలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, యువత కలిసి పనిచేసినప్పుడే డ్రగ్స్ రహిత, సురక్షిత, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీజీ సీఐడీ & ఏసీబీ శ్రీమతి చారు సిన్హా, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, మల్టీజోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది, తోష గ్రామ సర్పంచ్ శ్రీమతి పద్మ, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు

**అశ్వి అప్డేట్స్**

రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోడౌన్‌ను రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గోడౌన్ లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు (BUలు), కంట్రోల్ యూనిట్లు (CUలు), వీవీప్యాట్ యంత్రాలు (VVPATలు) మరియు ఎన్నికల సామగ్రి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎం ల నిర్వహణ, భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, సంరక్షణ, నిర్వహణలో నిర్దేశిత విధానాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

తదనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించి, వారి సమక్షంలోనే గోడౌన్‌కు సీల్ వేశారు.



ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహసీల్దార్, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి శ్రీ బొమ్మ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ

**అశ్వి అప్డేట్స్**



కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దనుక రాధిక (44) ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు.

కాంట్రాక్టర్ల బిల్లుల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడానికి అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ, బినామీ ఖాతాల ద్వారా అక్రమ కమిషన్లు వసూలు చేసినట్లు ఏసీబీ విచారణలో గుర్తించింది. అలాగే ఈ లావాదేవీల కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి....

చెన్నైలో మహిళల భద్రత, రక్షణను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో 'సింగపెన్నె స్పెషల్ ఫోర్సెస్' కార్యక్రమాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి C. Joseph Vijay ప్రారంభించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడం, బాధితులకు వేగవంతమైన సహాయం అందించడం, భద్రతా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం ఈ ప్రత్యేక దళం ప్రధాన లక్ష్యంగా పనిచేయనుంది.

ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ మహిళల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాంకేతికత, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో ఈ ఫోర్స్ పనిచేస్తుందని వెల్లడించారు.




మహిళల సాధికారత, రక్షణ కోసం తీసుకొస్తున్న ఈ కొత్త కార్యక్రమం తమిళనాడులో మహిళా భద్రతకు మరింత బలం చేకూర్చుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## వికలాంగుడిపై దాడి అత్యంత అమానుషం – దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి


- **జైపూర్ కాలనీలో గాయపడిన భాస్కర్ రెడ్డిని పరామర్శించిన ముత్తినేని వీరయ్య, మల్‌రెడ్డి రాంరెడ్డి**

**అశ్వి అప్డేట్స్**

నాగోల్ డివిజన్ జైపూర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడి దాడిలో గాయపడిన వికలాంగుడు భాస్కర్ రెడ్డి గారిని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ముత్తినేని వీరయ్య గారు, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు ఆయన నివాసంలో పరామర్శించారు. భాస్కర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ... వికలాంగుడైన వ్యక్తిపై రాజకీయ కక్షతో దాడి చేయడం అత్యంత దురదృష్టకరమైన, ఖండించదగిన చర్య అని అన్నారు. శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తిపై దాడికి పాల్పడటం మానవత్వాన్ని మరిచిన చర్య అని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ... వికలాంగుల హక్కులు, గౌరవాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాధితుడికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. భాస్కర్ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగోల్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు ఎర్రవెల్లి మంజుల రెడ్డి, చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి , గడ్డిఅన్నారం AMC డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి , నాయకులు చంద్రా రెడ్డి, గాంధీ నాయక్ , జైపాల్ రెడ్డి , రోజా రెడ్డి, అరుణ , ఖాజా , వికలాంగుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## దళిత బాలికపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి సిపిఐ జేఏసీ డిమాండ్

**ఆశ్వి అప్డేట్స్ , ఏపీ బ్యూరో ప్రతినిధి**


దళిత బాలిక పైన దాడికి గురై హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న దళిత బాలికను పరమర్శిస్తున్న కళ్యాణదుర్గం నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి గోపాల్ తాలూకా సహాయ కార్యదర్శి సెట్టూరు నరసింహులు ఎస్సీ ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షులు చెలమప్ప సెట్టూరు మండల కార్యదర్శి తిమ్మరాయుడు సిపిఐ గోపాల్ సిపిఐ నరసింహులు జేఏసీ చెలిమప్ప మాట్లాడుతూ నాయకులు మాట్లాడుతూ కళ్యాణదుర్గం మల్లెపల్లి గ్రామానికి చెందిన బీసీ సమాజిక వర్గానికి చెందిన పెళ్లయినవ్యక్తి కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చెందిన దళిత బాలికను మోసం చేసి వాడుకొని మీరు మాదిగోళ్లు మేము గొల్ల వాళ్ళము గొల్లల కాలినికి రాకూడదని అసూయతో అబ్బాయి పేరెంట్స్ నలుగురు కలిసి గొల్లల దొడ్డిలోకి వస్తావా అంటూ మాదిగ లంజా అంటూ జుట్టు పట్టుకొని కట్టెలతో బాధతు స్పృహ తప్పే పోయే విధంగా రక్త గాయాలు అయ్యే విధంగా దాడి చేసి అవమానపరిచారని ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జేఏసీ నాయకులు కళ్యాణదుర్గం ప్రభుత్వం హాస్పిటల్ లోగాయపడి చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తూ జరిగిన సంఘటనను అడిగి తెలుసుకోవడం జరిగింది దళిత బాలిక పైన దాడి చేసి గాయపరిచి న పై నలుగురిపై హత్యాయత్నం కేసు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని లేనిపక్షంలో దళిత బాలికకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలతో ముందుకు వెళతామని డిమాండ్ చేస్తున్నామనీ ఈ కార్యక్రమంలో దురద కుంట నారాయణ బాధితులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా చింతల నాగరాజు

**అశ్వి అప్డేట్స్ కొండపాక:**

కుకునూర్ పల్లి మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా మెదినీపూర్ గ్రామ ఉప సర్పంచ్ చింతల నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల ఉప సర్పంచులంతా సమావేశమై ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చింతల నాగరాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మండలంలోని ఉప సర్పంచులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 13 మందితో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రిప్పాల మహేష్, కన్నమైన రాజు, బుర్రి కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా యెల్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శులుగా దోంతి సత్తయ్య, దబ్బెట నవీన్, కోశాధికారిగా శేరిపల్లి లింగం, ప్రచార కార్యదర్శిగా మానసక జాని, సలహాదారుగా లగిశెట్టి రవిందర్, కార్యవర్గ సభ్యులుగా ఈసాల నవీన్, రెడ్డమైన కనకయ్య, దున్నపోతుల సమ్మయ్య. , బైరి మల్లేశం ఎన్నికయ్యారు.





# ఎన్నేళ్లు పాలించామన్నది కాదు.. ఏం సాధించామన్నదే గీటురాయి!

దేశ రాజకీయ చరిత్రలో జూన్ 10, 2026 ఒక గణాంకపరమైన మైలురాయిగా నమోదు కావచ్చు. తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును దాటేస్తూ.. అత్యధిక కాలం ప్రజలచే ఎన్నికైన ప్రధానిగా నరేంద్ర మోడీ రికార్డు సృష్టించారు. 4,399 రోజులు పూర్తి చేసుకుని సరికొత్త అంకెను నమోదు చేశారు. అయితే చరిత్ర ఎప్పుడూ పాలకుల క్యాలెండర్లను చూసి తీర్పు చెప్పదు. ఎన్నేళ్లు అధికారంలో ఉన్నామన్నది కాదు.. ఆ కాలంలో దేశానికి ఏం చేశాం, ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పులు తెచ్చామన్నదే అసలైన గీటురాయి. ఒకవైపు శూన్యం నుంచి దేశాన్ని నిర్మించిన నెహ్రూ దార్శనికత.. మరోవైపు దశాబ్దాల పాటు నిర్మించుకున్న ప్రభుత్వ ఆస్తులను కరిగించేస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకున్న మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు.. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### పునాదులు లేని దేశానికి ప్రాణం పోసిన నెహ్రూ

బ్రిటిష్ వారి వందల ఏళ్ల దోపిడీలో సర్వస్వం కోల్పోయి, తీవ్రమైన పేదరికం, నిరక్షరాస్యత, ఆకలి చావులతో అల్లాడుతున్న దేశాన్ని నెహ్రూ తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆయన ముందున్న సవాళ్లు సామాన్యమైనవి కావు. విభజన గాయాలతో రగులుతున్న దేశాన్ని ఏకతాటిపైకి తేవడంతో పాటు ఆధునిక భారతానికి పునాదులు వేయాల్సిన గురుతర బాధ్యత ఆయన భుజాలపై పడింది. ఈ దేశానికి భారీ ఆనకట్టలే ఆధునిక దేవాలయాలని ఆయన బలంగా నమ్మారు. వ్యవసాయాన్ని బలోపేతం చేసేందుకు భాక్రా నంగల్, నాగార్జున సాగర్ లాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.నేడు మనం గర్వంగా చెప్పుకుంటున్న అత్యున్నత విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలన్నీ నెహ్రూ ముందుచూపుతో ప్రాణం పోసుకున్నవే. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ లాంటి విద్యా సంస్థలను స్థాపించి దేశ యువతకు ప్రపంచ స్థాయి విద్యను అందించారు. ఇస్రో, డీఆర్డీఓ, అణు ఇంధన సంస్థల ఏర్పాటు ద్వారా అంతరిక్షం నుంచి రక్షణ రంగం వరకు స్వదేశీ పరిజ్ఞానానికి ఆనాడే బీజం వేశారు. ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో స్థాపించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారు. సంస్థానాల విలీనంలో సర్దార్ పటేల్‌కు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి దేశ పటాన్ని సుస్థిరం చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను బలోపేతం చేస్తూ, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేశారు. అంతర్జాతీయ స్థాయిలో అలీన విధానాన్ని ప్రవేశపెట్టి ప్రపంచ దేశాల మన్ననలు పొందారు. ఇవన్నీ కేవలం రికార్డుల కోసం చేసినవి కావు.. భవిష్యత్ తరాల బాగు కోసం వేసిన బలమైన పునాదులు.

### వైఫల్యాల నీడలో మోడీ పాలన

ప్రస్తుత ప్రధాని మోడీ విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తుంది. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం లాంటివి భావోద్వేగాల పరంగా, రాజకీయంగా లబ్ధి చేకూర్చి ఉండవచ్చు. కానీ సామాన్యుడి బతుకును మార్చే ఆర్థిక పురోగతిలో మాత్రం ఈ పన్నెండేళ్ల పాలన దారుణంగా విఫలమైందనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. పెద్ద నోట్ల రద్దు అనే అనాలోచిత నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీసింది. లక్షలాది లఘు, చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. ఆ తర్వాత ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా హడావుడిగా అమలు చేసిన జీఎస్టీ విధానం చిరు వ్యాపారుల నడ్డి విరిచింది.పదేళ్ల కిందట ఉన్న నిత్యావసరాల ధరలతో పోలిస్తే నేడు పరిస్థితులు ఆకాశాన్నంటుతున్నాయి. గ్యాస్ సిలిండర్ ధర, పెట్రోల్, డీజిల్ రేట్లు సామాన్య మధ్యతరగతి ప్రజలకు గుదిబండగా మారాయి. రికార్డు స్థాయిలో పెరిగిన ద్రవ్యోల్బణం సామాన్యుల పొదుపును హరించివేసింది. నెహ్రూ కాలంలో ఎంతో కష్టపడి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను, లాభాల్లో ఉన్న జాతీయ ఆస్తులను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. దేశ సంపద అంతా కొద్దిమంది బడా బాబుల చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్న తీరు ఆర్థిక అసమానతలకు దారితీస్తోంది.

### ఉద్యోగాల్లేక యువత ఆగమాగం.. ప్రజాస్వామ్య వ్యవస్థల నిర్వీర్యం..

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలిపోయింది. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ రేటు పెరిగిపోవడం యువతలో తీవ్ర నైరాశ్యాన్ని నింపుతోంది. సైన్యంలో సైతం అగ్నిపథ్ లాంటి కాంట్రాక్ట్ విధానాలను తీసుకురావడం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేయడమే. అధికారాన్ని నిలబెట్టుకునే క్రమంలో రాజ్యాంగ బద్ధ సంస్థలను సైతం ప్రతిపక్షాలను అణచివేసే ఆయుధాలుగా వాడుకుంటున్నారన్న అపఖ్యాతి ఈ పదేళ్ల పాలనలో స్పష్టంగా కనిపించింది. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలను ప్రయోగించి ప్రాంతీయ పార్టీలను భయాందోళనలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇక అన్నదాతల విషయానికి వస్తే.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు వీధుల్లోకి వచ్చి ఏడాది పాటు ప్రాణాలకు తెగించి పోరాడాల్సి వచ్చింది. ఆ ఉద్యమంలో ఏడు వందల మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోవడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. రికార్డులు సాధించడం అంటే క్యాలెండర్ పేజీలను తిప్పడం కాదు. పాలకుడు దిగిపోయిన దశాబ్దాల తర్వాత కూడా దేశ ప్రజలు ఆ ఫలాలను అనుభవించగలగాలి. నెహ్రూ నిర్మించిన ఆనకట్టల నీరు నేటికీ పొలాలను సస్యశ్యామలం చేస్తోంది. ఆయన స్థాపించిన విద్యాసంస్థల నుంచి వచ్చిన ఎంతో మంది నేడు ప్రపంచ కుబేరుల జాబితాలో ఉన్నారు. కేవలం ప్రచార ఆర్భాటాలు, భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలతో రికార్డులు బద్దలు కొట్టవచ్చు కానీ.. చరిత్ర పుటల్లో శాశ్వతమైన, గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకోవడం మాత్రం అసాధ్యం. ఎన్ని రోజులు అధికారంలో ఉన్నామన్న అంకెల కంటే.. ఎంతమంది కన్నీళ్లు తుడిచామన్నదే నిజమైన నాయకుడికి అసలైన గీటురాయి



డాక్టర్ కంచర్ల అచ్యుత రావు

# నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ



న్యూఢిల్లీ, జూన్ 10 : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత రాజకీయ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు. బుధవారంతో ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకుని, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డును అధిగమించారు. నరేంద్ర మోడీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి మూడోసారి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నాటికి ఆయన పదవీకాలం 4,399 రోజులకు చేరుకుంది. ఇప్పటివరకు ఈ రికార్డు దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. 1952 మే 13న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నెహ్రూ 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజులపాటు పదవిలో కొనసాగారు. దీంతో ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం సేవలందించిన నాయకుడిగా మోడీ కొత్త రికార్డు నెలకొల్పారు. ఎన్నికైన తర్వాత వం-సగా అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నాయకుల జాబితాలో నెహ్రూ తర్వాత ఇందిరా గాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులపాటు ప్రధానిగా పనిచేశారు.



### సుపరిపాలన అతిపెద్ద పరీక్ష

#### ఎక్స్ వేదికగా మోడీ పోస్ట్

న్యూఢిల్లీ, జూన్ 10: ప్రధాని నరేంద్ర మోడీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోడీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోడీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోడీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు.

### మోడీకి రాష్ట్రపతి అభినందనలు

ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. మోడీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయి నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన పాలనలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కొనియాడారు.

### విదేశీ నేతల శుభాకాంక్షలు

మోడీ సాధించిన ఈ ఘనతపై పలు దేశాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అమెరికా ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలియజేశారు. భారత అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠ పెంపులో మోడీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని వారు పేర్కొన్నారు.

### చంద్రబాబు, లోకేశ్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. దేశ అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక సంస్కరణల ద్వారా భారత దేశాన్ని కొత్త దిశగా నడిపించారని కొనియాడారు. కేంద్ర మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, నెహ్రూ రికార్డును అధిగమించడం అనితరసాధ్యమైన ఘనత అని పేర్కొన్నారు.

### బండి సంజయ్ స్పందన

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ భారత రాజకీయ చరిత్రలో మోడీ కొత్త అధ్యాయాన్ని లిఖించారన్నారు. నెహ్రూ రికార్డును అధిగమించడం ద్వారా దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నాయకుడిగా మోడీ నిలిచారని పేర్కొన్నారు. భారత దేశాన్ని ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే నాయకత్వం మోడీదేనని ఆయన అభిప్రా యపడ్డారు.

# పాకిస్థాన్‌లో విషాదం

## పీవోకేలో కూలిన పాక్ హెలికాప్టర్

## 21 మంది సైనికులు మృతి

ఢిల్లీ: దాయాది దేశం పాకిస్థాన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగా కూలిపోయింది. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పాకిస్థాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్‌ను ఉటంకిస్తూ పాకిస్థాన్ డాన్ పత్రిక వెల్లడించింది. హెలికాప్టర్‌లో 21 మంది సైనికులు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందరూ చనిపోయినట్లుగా సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న సైనిక సిబ్బంది దేశ సేవలో అమరులయ్యారని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పాకిస్థాన్ ఆర్మీ దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ.. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ముజఫరాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పాకిస్థాన్ సైనిక వర్గాల్లో విషాదాన్ని నింపింది.

### ఎంఐ-17 హెలికాప్టర్ ప్రత్యేక ఇదే

MI-17 అనేది MI-8 నుంచి నవీకరించబడింది. కొత్త వెర్షన్ మిల్ మాస్కో హెలికాప్టర్ ప్లాంట్ ద్వారా నిర్మించారు. రష్యాలో తయారైన అత్యధిక బరువు మోసే రవాణా హెలికాప్టర్ ఇది. ఈ హెలికాప్టర్‌లో 30 మంది సైనికులు, 12 స్ట్రెచర్‌లు, సుమారు 4 వేల సరుకు మోయగలదు. మూడు టన్నుల వరకు బరువు మోయగలదు. రెండు క్లిమోవ్ ౦౨3-117 ఇంజిన్‌ల ద్వారా శక్తి పొందుతుంది. గంటలకు 250 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంది.



# ఎన్డీఏ భేటీలో ప్రధాని మోడీకి అభినందనలు

## వివిధ రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీలు హాజరు

న్యూఢిల్లీ, జూన్ 10: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే నేతల పెద్దఎత్తున అభినందలు తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడం, సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును మోదీ సొంత చేసుకున్న నేపథ్యంలో ఎన్డీయే నేతల సమావేశం బుధవారంనాడిక్కడ భారత్ మండపంలో జరిగింది. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1964 మే 27న తుదిశ్వాస విడిచేంత వరకూ 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు. 2014 మే 26న ప్రధాని పగ్గాలు చేపట్టిన ఆయన బుధవారంతో ఆ పదవిలో నిరాటంకంగా 4,399 రోజులు పూర్తిచేసుకున్నారు. తద్వారా దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకునున్నారు.

# గ్రెనేడ్ పేలుడు విషాదం

- ఉరిలో దుర్ఘటన ఘటన
- ఇద్దరు జవాన్ల మృతి
- విచారణకు ఆదేశాలు జారీ



జమ్మూ, జూన్ 10 : దేశ సరిహద్దుల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న భారత సైన్యంలో విషాదం చోటుచేసుకుంది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్‌లో ఉన్న కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలడంతో ఇద్దరు భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సైన్యాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేయగా, మృతుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం సైనిక శిబిరంలో సాధారణ విధుల్లో భాగంగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఒక సిబ్బంది నుంచి మరొక సిబ్బందికి అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సమయంలో అనుకోకుండా ఒక గ్రెనేడ్ పేలింది. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీపంలో ఉన్న ఇద్దరు జవాన్లు తీవ్ర గాయాల పాలయ్యారు. శిబిరంలో ఒక్కసారిగా కలకలం రేగగా, ఇతర సైనికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన జవాన్లను అత్యవసర చికిత్స కోసం సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రాణాలు కాపాడలేకపోయారు. చికిత్స పొందుతూ ఇద్దరు జవాన్లు మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. దీంతో సైనిక శిబిరంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన రక్షణ శాఖ వర్గాలు ఇది పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన అని స్పష్టం చేశాయి. ఇందులో ఉగ్రవాదుల ప్రమేయం గానీ, శత్రు దేశాల చర్యలు గానీ, ఇతర బాహ్య శక్తుల పాత్ర గానీ లేదని వెల్లడించాయి. విధి నిర్వహణ సమయంలో చోటుచేసుకున్న ప్రమాదం కారణంగానే ఈ విషాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలిపాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సైన్యం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. గ్రెనేడ్ ఎలా పేలింది, భద్రతా నిబంధనల అమలులో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను విచారణలో పరిశీలించనున్నారు. సాధారణంగా ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా జరుగుతాయని, ఆయుధాలు, పేలుడు పదార్థాల నిర్వహణలో అత్యంత అప్రమత్తత అవసరమని అధికారులు పేర్కొన్నారు. మృతి చెందిన జవాన్ల కుటుంబాలకు భారత సైన్యం, రక్షణ శాఖ అధికారులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అందాల్సిన ఆర్థిక సాయం, ఉద్యోగ సంబంధిత ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ వేగంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశ సేవలో ఉన్న ఇద్దరు సైనికుల మృతి పట్ల దేశవ్యాప్తంగా సంతాపం వ్యక్తమవుతోంది.

# ట్రోలింగ్ వచ్చినప్పటికీ తగ్గని జాన్వీ క్రేజ్..



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఇటీవల గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన 'పెద్ది' మూవీలో నటించింది. ఇక ఈ సినిమా జూన్ 4న విడుదలై బాక్సాఫీసు వద్ద పలు రికార్డులు బ్రేక్ చేస్తోంది. కానీ జాన్వీ కపూర్ పాత్రపై మాత్రం దారుణమైన ట్రోలింగ్ జరుగుతోంది. ఆమెను ఇందులో ఓ గ్లామర్ బొమ్మగా మాత్రమే చూపించారని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న బుచ్చిబాబు సనా ఇప్పటికే క్షమాపణలు చెప్పి ఆ సీన్లను తొలగించిన విషయం తెలిసిందే. 'పెద్ది' బ్లాక్ బస్టర్ హిట్‌గా దూసుకుపోతూ.. ఇప్పటికే రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబడుతోంది. ఇక జాన్వీ కపూర్ ట్రోలింగ్‌పై ఇప్పటికే హీరోయిన్లు, సినీ స్టార్స్ స్పందించి ఆమెకు మద్దతుగా నిలిచారు. ఇక జాన్వీ తెలుగు ఇండస్ట్రీని వీడే సమయం ఆసన్నమైందని కూడా నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, జాన్వీ కపూర్ ఓ బంపర్ ఆఫర్ దక్కించుకున్నట్లు టాక్. ట్రోలింగ్ వచ్చినప్పటికీ అమ్మడు హార్రర్ మూవీలో నటించజేసేందుకు మేకర్స్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. కల్ట్ క్లాసిక్ హారర్ ఫాంటసీ చిత్రంగా గుర్తింపు పొందిన 'తుంబాడ్' దర్శకుడు రాహి అనిల్ బర్వే ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. ఈ చిత్రంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతి అందించేలా ఉండబోతోందని టాక్. ఈ ప్రాజెక్ట్‌కు మద్దతుగా ప్రముఖ నిర్మాణ సంస్థ జీయో స్టూడియోస్ నిలవడంతో సినిమాపై హైప్ క్రియేట్ అవుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌పై జాన్వీ కపూర్ కూడా ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు టాక్. కేవలం నటించడం మాత్రమే కాకుండా పాత్ర కోసం పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని కూడా ఆమె నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకమైన ట్రైనింగ్ కూడా తీసుకోవాలనుకుంటుందట.

# ఆ ప్రాజెక్ట్ ప్రారంభించడానికి ఉత్సాహంగా ఉన్నాను..




కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ గత ఏడాది 'మ్యాక్స్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. కానీ హిట్ అందుకోలేకపోయారు. ప్రస్తుతం భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షన్ 'బిల్లా రంగా బాషా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ మూవీకి 'విక్రాంత్ రోణ' ఫేమ్ అనూప్ భండారి దర్శకత్వం వహించనున్నారు. ఈ హిట్ కాంబోలో మరో మూవీ రాబోతుండటంతో 'బిల్లా రంగా భాషా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం 2209వ సంవత్సరంనేపథ్యంలో సాగే ఒక సైన్స్ ఫిక్షన్, యాక్షన్, అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో కిచ్చా సుదీప్ సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు టాక్. ఈ సినిమా కన్నడతో పాటు తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కాబోతోంది. 'హనుమాన్' ఫేమ్ నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కిచ్చా సుదీప్ సొంత బ్యానర్ సుప్రి యాన్వి పిక్చర్స్ స్టూడియో కూడా ఈ నిర్మాణంలో భాగస్వామిగా ఉంది. ఇదిలా ఉంటే.. కిచ్చా సుదీప్ 'బిల్లా రంగా భాషా'తో పాటు మరో నాలుగు సినిమాలు చేస్తున్నట్లు గత కొద్ది కాలంగా పలు పుకార్లు షికారు చేస్తున్నాయి. అందుకే కాస్త గ్యాప్ తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు నెట్టింట పలు పోస్టులు పెడుతున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ విషయంపై కిచ్చా సుదీప్ ట్విట్టర్ ద్వారా రియాక్ట్ అయ్యారు. తన కెరీర్ పట్ల గానీ, అభిమానుల ప్రేమ పట్ల గానీ తాను ఎప్పుడూ అశ్రద్ధగా లేనని స్పష్టం చేస్తూనే, రాబోయే సినిమాలపై క్రేజీ అప్‌డేట్స్ ఇచ్చారు. "మీ అందరి మాటలు వింటున్నాను. సినిమాలకు దూరంగా ఉండి వేరే పనుల్లో బిజీగా ఉన్నానంటే.. దానికి కారణం మీ ప్రేమను గానీ, ఈ అద్భుతమైన కెరీర్‌ను గానీ తక్కువగా చూడటం కాదు. నాకు కథలు చెప్పడం, చిత్రాల ద్వారా మిమ్మల్ని అలరించడం కంటే ఇష్టమైన పని మరొకటి లేదు. నన్ను మళ్లీ సినిమాల్లో చూడాలని మీరు చేస్తున్న ఈ వేక్ అప్ ప్రయత్నం నిజంగా చాలా బాగుంది. నా పని పట్ల మీకున్న ప్రేమకు ఇది నిదర్శనం.. అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అంటూ ఎమోషనల్ అయ్యారు. తాను సినిమాలకు విరామం ఇవ్వడానికి గల కారణాన్ని కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. "కొన్నిసార్లు మన చుట్టూ ఉన్న మనుషులకు, కొన్ని పరిస్థితులకు మన అవసర, మద్దతు చాలా అవసరం అవుతాయి. అందుకే ఈ చిన్న బ్రేక్ తీసుకున్నాను. కానీ ఈ విరామంలో కూడా నేను ఖాళీగా లేను.. ఒక బాధ్యతాయుతమైన పనిలోనే ఉన్నాను" అని వివరించారు. అంతేకాకుండా అభిమానులను ఖుషీ చేసే వార్తను ప్రకటిస్తూ.. జూన్ 26వ తేదీ నుంచి 'బిల్లా రంగా భాషా' అనే చిత్రంతో మళ్లీ షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు ప్రకటించారు. అక్కడి నుండి ఇక ఏమాత్రం గ్యాప్ లేకుండా వరుసగా సినిమాలు చేస్తానని ప్రామిస్ చేశారు. ఇప్పటికే 4 స్క్రిప్ట్‌లను లాక్ చేశానని, వాటన్నింటినీ వీలైనంత త్వరగా పట్టాలెక్కించడానికి ఎంతో ఉత్సాహంగా ఉన్నానని చెప్పుకొచ్చారు. ఈ ప్రకటనతో సుదీప్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



# 'ఆల్ఫా' టీజర్‌పై షారుఖ్ ఖాన్ ప్రశంసలు.. ఆలియాను సిగ్మా గర్ల్ అంటూ పోస్ట్

యష్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ ప్రాజెక్ట్ 'ఆల్ఫా'. హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా శివ రావల్ తెరకెక్కిస్తుండగా.. ఇందులో ఆలియా భట్, శార్వరి వాఘ్, బాబీ డియోల్, అనిల్ కపూర్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విడుదలై నెటిజన్లతో పాటు స్టార్ హీరోల ప్రశంసలు దక్కించుకుంటూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. తాజాగా, 'ఆల్ఫా' టీజర్‌పై బాలీవుడ్ స్టార్ హీరో షారుఖ్ ఖాన్ ప్రశంసలు కురిపిస్తూ.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ పోస్ట్ పెట్టారు. ఈ సినిమాలో లీడ్ రోల్ చేస్తున్న అలియా భట్ యాక్షన్‌పై షారుఖ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "వెల్ డన్ అలియా.. కొన్ని ఏళ్లుగా నీ నటనతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టావు , ఇప్పుడేమో విలన్ల ఎముకలు విరుస్తున్నావు . రోజురోజుకూ నీ టాలెంట్ పెరుగుతూనే ఉంది. ఈ 'ఆల్ఫా' సినిమా అందరి మనసులు గెలవాలని కోరుకుంటున్నాను. అలాగే సీక్వెల్ కోసం కొందరు విలన్లనైనా ప్రాణాలతో వదిలేయ్.. గో గెట్ దెమ్ సిగ్మా గర్ల్!" అంటూ అలియాను సరదాగా అభినందించారుటీజర్‌లో మెంటర్‌గా, విలన్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించిన బాబీ డియోల్‌ను షారుఖ్ ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. "లార్డ్ బాబీ.. నువ్వు విలన్‌గా బ్యాడ్‌గా ఉన్నప్పుడే చాలా బాగుంటావు. నీకు నా పెద్ద హగ్" అని రాసుకొచ్చారు. చివర్లో ఈ చిత్ర దర్శకుడు శివ్ రావైల్‌తో పాటు 'ఆల్ఫా' టీమ్ మొత్తానికి షారుఖ్ ఖాన్ తన బెస్ట్ విషెస్ తెలియజేశారు. షారుఖ్ చేసిన ఈ పోస్ట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. కాగా.. 'ఆల్ఫా' చిత్రం జూన్ 3న థియేటర్స్‌లోకి రాబోతోంది.






# డబ్బు కోసం నేను సినిమాలు చేయడం లేదు..

కోలీవుడ్ యంగ్ బ్యూటీ దుషారా విజయన్ ప్రస్తుతం మకుటం, జిడిఎన్ సినిమాలతో ఫుల్ బిజీగా అయిపోయింది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ రెండు చిత్రాలు త్వరలోనే విడుదల కాబోతున్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న దుషారా సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ ప్రాధాన్యత, పారితోషికం గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడారు. "నేను నా కెరీర్‌ను మోడలింగ్‌తో ప్రారంభించాను. మోడలింగ్‌లో కేవలం గ్లామర్‌గా కనిపించడమే ముఖ్యం, అక్కడ నటీనటులను ఒక వస్తువులా చూసే ప్రమాదం ఉంది. కానీ సినిమాలో మాత్రం టాలెంట్‌కే మొదటి స్థానం దక్కుతుంది. కొందరు స్టార్ హీరోలు కేవలం పాన్-ఇండియా క్రేజ్ ఉండి, ఒక నిర్దిష్టమైన లుక్ ఉన్న గ్లామరస్ హీరోయిన్లతోనే పని చేయడానికి ఇష్టపడతారు. కానీ నా విషయానికి వస్తే, దర్శకులు నా టాలెంట్‌ను చూసే నన్ను సంప్రదిస్తున్నారు. అందుకే నా కెరీర్ పరంగా నేను చాలా సంతృప్తిగా ఉన్నాను" అని దుషారా తెలిపారు. అలాగే తాను డబ్బు కోసం సినిమాలు చేయడం లేదని.. తనకు మంచి బ్యాక్‌గ్రౌండ్ ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ చిత్రాలు చేయడం మానేసినా తన ఫ్యామిలీ తనను చూసుకోగలదని అన్నారు. కాబట్టి తనకు పారితోషికం కంటే నటన ముఖ్యమని.. డబ్బు అనేది అదనపు బోనస్ మాత్రమే అని తెలిపింది. ప్రస్తుతం తనకు ఇస్తున్న పారితోషికంతో తాను చాలా సంతోషంగా ఉన్నట్లు దుషారా విజయన్ స్పష్టం చేశారు.

# నేనేం పాపం చేశానని వరుస కష్టాలు చుట్టుముడుతున్నాయి..



మెగాస్టార్ చిరంజీవి చిన్నకూతురు శ్రీజ ఒకప్పుడు సెన్సేషన్ క్రియేట్ చేశారు. 2007లో శిరీష్ భరద్వాజ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఓ కూతురు పుట్టాక మనస్పర్ధలు రావడంతో విడాకులు తీసుకుని విడిపోయారు. 2016లో మళ్లీ నటుడు కల్యాణ్ దేవ్‌ను రెండో పెళ్లి చేసుకోగా.. మరోసారి కూతురు జన్మించింది. కానీ వీరి కాపురం సవ్యంగా సాగలేదు. 2022లో విడాకులు తీసుకుని విడిపోయారు. విడాకులతో నిత్యం వార్తల్లో నిలిచిన శ్రీజ.. మొత్తానికి అన్నింటికీ దూరం అయి ప్రస్తుతం తన పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నారు. ఇన్నాళ్లకు మళ్లీ తాను అనుభవిస్తున్న బాధను బయటపెడుతూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేసి వార్తల్లో నిలిచారు. మొత్తానికి తను బాధల నుంచి బయటకు ఎలా వచ్చిందో వివరిస్తూ.. అసలు నాకే ఎందుకిలా జరుగుతోందని, నేనేం పాపం చేశానని ఇంత క్షోభ అనుభవిస్తున్నానని చాలా కాలం నాలో నేను బాధపడ్డానని ఆమె తెలిపారు. ఒకదాని తర్వాత ఒకటి కష్టాలు చుట్టుముడుతున్నప్పుడు ఎంతో మదనపడ్డానని, కానీ రాను రాను ఆ బాధ నుంచి నెమ్మదిగా బయటకు వచ్చానని చెప్పారు.

మన జీవితం ఎందుకు ఇలా ఉంది అని బాధపడటానికి బదులుగా, ఆ పరిస్థితిని మార్చుకోవడానికి మనమేం చేయగలమనే విషయాన్ని తెలుసుకోవడమే అసలైన మార్పు అని శ్రీజ వివరించారు. తనలో వచ్చిన మార్పు గురించి చెబుతూ.. సెల్ఫ్ మాస్టరీ ప్రాజెక్ట్ వల్ల తన ఆలోచనల్లో మంచి క్లారిటీ వచ్చిందని, జీవితం ఎంతో ప్రశాంతంగా మారిందని పేర్కొన్నారు. అసలు తనేంటో తనకు తెలిసిందని చెప్పారు. ఒకప్పుడు తన లైఫ్‌లో జరిగిన తప్పులే తన గుర్తింపును నిర్ధారిస్తాయని అనుకున్నానని, కానీ అది ఎంతమాత్రం నిజం కాదని తెలుసుకున్నానని వివరించారు. బాధ అనేది తనలో ఒక భాగం మాత్రమేనని, కానీ అదే జీవితం కాదని ఆ తర్వాత అర్థమైందని చెప్పుకొచ్చారు. మనిషిలో ఇంకా ఎన్నో లేయర్స్ ఉంటాయని, వాటిని ఒక్కొక్కటిగా తెలుసుకోవడం ఎంతో బాగుందని శ్రీజ అభిప్రాయపడ్డారు. ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడిన ఆమె ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. నిజంగా చాలా గ్రేట్ అని, ఎంతో మందికి ఇదొక మంచి ఇన్స్పిరేషన్ సూపర్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# ఆ తమిళ బ్లాక్‌బస్టర్ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్లను క్రాస్ చేసిన 'కరుప్పు'



సూర్య హీరోగా తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం ఇప్పటికే భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. చాలా కాలంగా సరైన విజయాల కోసం ఎదురుచూస్తున్న సూర్యకు ఈ సినిమా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, 'కరుప్పు' సినిమా ఓ తమిళ బ్లాక్‌బస్టర్ లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసినట్లు తెలుస్తోంది. కొంతకాలం క్రితం శివ కార్తికేయన్ హీరోగా నటించిన 'అమరన్' చిత్రం భారీ విజయాన్ని అందుకుని అద్భుతమైన వసూళ్లు సాధించింది.

అయితే ప్రస్తుతం 'కరుప్పు' సినిమా ఆ మూవీ లైఫ్‌టైమ్ కలెక్షన్లను అధిగమించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇంకా ఈ చిత్రం మంచి వసూళ్లను రాబడుతూనే ఉందని సమాచారం. ఇదిలా ఉంటే, ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ కూడా ఖరారైంది. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో జూన్ 12వ తేదీ నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఇక తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' అనే టైటిల్‌తో విడుదలై, టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని అందుకుంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in